బాబోయ్ బర్డ్ ఫ్లూ



గోపాలపురం మండలం వాదాలకుంటలో వైరస్ బారిన పడిన కోళ్లు



పెరవలి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

- పౌల్ట్రీ రంగాన్ని కుదిపేస్తున్న వైరస్
- వ్యాధితో చనిపోతున్న కోళ్లు
- చికెన్ విక్రయాలు నిషేధం

దేవరపల్లి: కొక్కొరోకో అంటూ అందరినీ నిద్రలేపే కోళ్లు.. తెలవారే సరికి చనిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు కోకొల్లలు జరుగుతున్నాయి. కానూరు, పెరవలి ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకినట్టు నిర్ధారణ కావడంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వైరస్ కోళ్ల పరిశ్రమను కుదిపేస్తోందని పౌల్ట్రీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీలోని కోళ్లే కాకుండా నాటు కోళ్లు చనిపోతున్నాయి. వీటికి కూడా వైరస్ సోకడంతో ఖరీదైన కోడి పుంజులు చనిపోతున్నాయని పలువురు యజమానులు తెలిపారు. మెట్ట ప్రాంతంలో కోళ్ల పౌల్ట్రీలతో పాటు కొంత మంది నాటు కోళ్లను పెంచుతున్నారు. ఒక్కో పందెం పుంజు రూ. 15 వేల నుంచి రూ.లక్ష ధర ఉం



కానూరు అగ్రహారంలో బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ అధికారులు

టోంది. పలు ప్రాంతాల్లో నాటు కోళ్లకు కూడా వైరస్ సోకి మృత్యువాత పడుతున్నాయి. ఒక్కో ఇంటి వద్ద సుమారు 50 నుంచి 100 నాటు కోళ్లు పెంచుతుంటారు. వీటి విలువ దాదాపు రూ. 10 నుంచి రూ.15 లక్షలు ఉంటుందని కోళ్ల పెంపకందారులు తెలిపారు. గోపాలపురం మండలం వాదాలకుంటలోని ఒక కోళ్ల ఫారంలో రెండు రోజులుగా సుమారు 8 వేల కోళ్లు చనిపోయినట్టు సమాచారం. సుమారు రూ. 5 లక్షలు ఆ యజమాని నష్టపోయినట్టు తెలిసింది. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పోతవరం రోడ్డులో పోలవరం కుడి కాలువ గట్టులో చనిపోయిన వేలాది కోళ్లను ఇటీవల గుట్టలుగా పడేశారు. నల్లజర్ల మండలం పోతవరం ప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. వైరస్ రోజు రోజుకూ విజృంభించడంతో పౌల్ట్రీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. చనిపోయిన కోళ్లను రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల శివార్లలోని కాలువ గట్లపై పడేస్తున్నారు.

గ్రామాల్లో కోడి మాంసం విక్రయిస్తున్న వ్యాపారులకు పంచాయతీ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. దేవరపల్లిలోని దుకాణదారులకు పంచాయతీ కార్యదర్శి ఎస్.రవి కిషోర్, సిబ్బంది నోటీసులు అందజేశారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించినందున దుకాణాల్లో మాంసం అమ్మకాలు చేయవద్దని నోటీసులో పేర్కొన్నారు. ఈ నిషేధం 15 రోజుల పాలు అమలులో ఉంటుందన్నారు. అలాగే గ్రామంలో రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. యర్నగూడెంలోని మాంసం దుకాణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఇంటింటా సర్వే

పెరవలి: బర్డ్‌ఫ్లూ నివారణకు గ్రామాల్లో చికెన్, గుడ్ల అమ్మకాలపై నిషేధం విధించి, ఇంటింటా సర్వే జరుపుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి, కానూరు పీహెచ్‌లను ఆయన సందర్శించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారులు ప్రచారం చేయాలన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వే గురించి ఆరా తీశారు. ఇదిలా ఉంటే కానూరు అగ్రహారంలో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. చికెన్ విక్రయించవద్దని షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చారు.

తాళ్లపూడి: చికెన్ అమ్మకాలు, కొనుగోళ్లు నిషేధించామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ టీబీ వెంకటరమణ తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కోళ్లు మృతి చెందడంతో కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు కోళ్ల విక్రయాలు నిషేధించారన్నారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లు తిన్నా కూడా అనారోగ్యం పాలవ్వడంతో పాటు ప్రమాదకరమని అన్నారు. పోచవరం, తాడిపూడిలో కోళ్లఫారాలను పరిశీలించి చనిపోయిన కోళ్లను పూడ్చి వేయాలని చెప్పామన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



పాలంగిలో ఫీవర్ సర్వే పరిశీలిస్తున్న ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్

ఉండ్రాజవరం: బర్డ్‌ఫ్లూ నివారణ చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. బర్డ్ ఫ్లూతో దమ్మెన్ను, మోర్త, వెలగదుర్రు, తాడిపర్రు, ఉండ్రాజవరం, చివటం, పాలంగి గ్రామాల్లో ప్రజలకు జ్వరాలపై వైద్య శిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానూరులోని ఓ పౌల్ట్రీలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో 10 కిలోమీటర్ల పరిధిలో ఉండ్రాజవరం మండలంపైనా దృష్టి పెట్టామన్నారు. గ్రామాల్లో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలతో ప్రతి గ్రామానికి రెండు టీమ్‌ల చొప్పున ఏర్పాటు చేసి బర్డ్ ఫ్లూ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సర్వేలో ఎవరికీ జ్వరాలు లేవని నిర్ధారించామని అన్నారు.

కోళ్లను విక్రయించరాదు

నిడదవోలు: పట్టణంలోని చికెన్ షాపుల్లో కోళ్లు, గుడ్లను మూడు వారాల పాటు విక్రయించరాదని మున్సిపల్ కమిషనర్ కె.కృష్ణవేణి తెలిపారు. ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చాగల్లు: స్థానికంగా కోడి మాంసం అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఎండీ అలీ తెలిపారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి దుకాణ యజమానులు, ప్రజలు సహకరించాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొవ్వూరు: రెవెన్యూ సమస్యల పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ పరమైన సమస్యలపై ఆయన సమీక్షించారు. రైతులు రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా డివిజన్ స్థాయిలో మండల తహసీల్దార్లతో రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తున్నామన్నారు. అండంగ, భూముల వివరాలు తప్పుగా నమోదు కావడంతో రైతులు బ్యాంకుల నుంచి, ఇతర సంస్థల నుంచి రుణాలు పొందే సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని అధిగమించేందుకు రికా



సమావేశంలో రెవెన్యూ సమస్యలను తెలుసుకుంటున్న జేసీ చిన్నరాముడు

ర్డుల్లో నమోదైన లోపాలను సరిదిద్దడం, చిన్న లోపాలను తక్షణం సరిచేయడం ద్వారా రైతుల రెవెన్యూ సమస్యలకు బ్రేక్ పడుతుందన్నారు. ఆర్డీఓ రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే ర్యాంపు ఏర్పాటు

కొవ్వూరు: ఆరికిరేవుల ఇసుక ర్యాంపును ప్రజాభిప్రాయం మేరకు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్ఆర్‌సీ) భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం ఆరికిరేవుల పంచాయతీ కార్యాలయం వద్ద ఇసుక ర్యాంపు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. 58.1 హెక్టార్లలో 5,81,000 క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యమవుతుందన్నారు. ఎస్‌వీ ఎన్వీరో ల్యాబ్ అండ్ కన్సల్టెంట్ ప్రతినిధి ర్యాంపు ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు చదివి వినిపించారు. సెమీ మెకనైజ్డ్ పద్ధతిలో మీటరులోతు మాత్రమే ఇసుక తవ్వాల్సి ఉంటుందన్నారు. శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం పరిమితికి లోబడి ఉందన్నారు. వివిధ రకాల పనుల



ఆరికిరేవులలో ప్రజాభిప్రాయ సేకరణలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి

నిమిత్తం ముప్పై మంది స్థానికులకు ఉపాధి చూపించనున్నట్లు ప్రకటించారు. ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీలపై టార్పాలిన్లు కప్పాలని సూచించారు. మాజీ ఉప సర్పంచ్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇసుక లారీలు ఓవర్ లోడుతో వెళుతుండడంతో రోడ్డు వెంబడి జారిపడిన ఇసుక కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. యనమదల కృష్ణారావు మాట్లాడుతూ గ్రామ సమీపంలో గోదావరి ఒడ్డు కుంగి ప్రమాద భరితంగా ఉందన్నారు. గ్రామస్తులకు తక్కువ ధరకు ఇసుక అందించాలని, ఎడ్డుల బండ్లు, ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వాలని కోరారు. గ్రామ సర్పంచ్ మారిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ర్యాంపుల్లోకి వచ్చే వాహనాలకు కచ్చితంగా పార్కింగ్ సదుపాయం చూపించాలని కోరారు. పర్యావరణ శాఖ ఈఈ ఎంబీఎస్ శంకరరావు, మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, నాయకులు చావా శ్రీనివాసరావు, గుత్తా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి 30 రోజుల పాటు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్, ఉపాధి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. కళాశాలలో ఈ శిక్షణ తరగతులు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ ట్రైనర్ బి.సూర్య 91217 14649, 96760 52454 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణ

కొవ్వూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిసెప్షనిస్టు, ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె.సునీత తెలిపారు. ఈ కోర్సుతో పాటు కంప్యూటర్, జాబ్ స్కిల్స్ అదనంగా నేర్పిస్తామన్నారు. ఈ నెల 17 నుంచి కళాశాలలోని స్కిల్ హబ్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు పొందిన సర్టిఫికెట్స్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను కళాశాల స్కిల్ హబ్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తు పూర్తి చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73062 32373 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

పొక్లెయిన్ సీజ్

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు ఇసుక ర్యాంపులో పొక్లెయిన్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి ఆదేశాల మేరకు ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వో కె.నాగేశ్వరరావులు పొక్లెయిన్‌ను సీజ్ చేసి ఆర్డీఓకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. తాళ్లపూడి గ్రామానికి చెందిన నామన బుజ్జి ఇసుక ర్యాంపులో పొక్లెయిన్ ద్వారా ఇసుక లోడింగ్ చేస్తున్నారని అధికారులకు సమాచారం వచ్చింది. ర్యాంపు నిర్వాహకులు మాత్రం ర్యాంపులో బాట



ర్యాంపులో పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

పనులు చేయిస్తున్నట్టు తెలిపినట్టు అధికారులు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు.

ఆరికిరేవులలో సినిమా సందడి

కొవ్వూరు: మైత్రీ మువీ మేకర్స్ బ్యానర్‌పై రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిస్తున్న సినిమా షూటింగ్ మంగళవారం ఆరికిరేవుల గ్రామం బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న స్నానఘట్టం వద్ద జరిగింది. ఈ చిత్రానికి మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. మూడో చిత్రంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. చిత్రంలో రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్ వంటి నటులు నటిస్తున్నారని అన్నారు. నెల రోజుల పాటు ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరించనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. గోదావరి నదిలో బోట్లపై హీరో ప్రయాణిస్తున్నట్లు, ఒడ్డున మత్స్యకారుల సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. మత్స్యకారుల సం



ఆరికిరేవులలో సినిమాలో ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

బంధించిన కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానికులు పెద్ద సంఖ్య వచ్చి నటీనటులను చూశారు.

రీ సర్వేపై చైతన్యం తీసుకురావాలి

కొవ్వూరు: భూముల రీ సర్వే నేపథ్యంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకు రావాలని ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా రీ సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, కొవ్వూరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

అన్ని చర్యలూ తీసుకోండి

పెరవలి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ రాణి సుస్మిత అధికారులను ఆదేశించారు. పెరవలిలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం



పెరవలిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

గతంలో రెండు పోలింగ్ స్టేషన్లు ఉండేవని, నేడు ఓటర్లు పెరగటంతో 3 స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. పెరవలి మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,927 ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల పోలింగ్ 27న పోలింగ్ జరుగుతుందని వివరించారు. తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, ఆర్ఐ పావని పాల్గొన్నారు.

కాటినీ వదలని కూటమి నాయకులు

- రూ.2 లక్షల విలువైన 30 వేపచెట్ల నరికివేత
- క్రైస్తవ శ్మశాన వాటికలో ఘటన

రాజమహేంద్రవరం రూరల్: దోపిడీలో ఆరితేరిన కూటమి నాయకులు శ్మశానాన్ని కూడా వదలడం లేదు. అందిన కాడికి దోచుకుని సొమ్ములు చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. రూరల్ మండలం బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలో క్రైస్తవ శ్మశాన వాటికలోని వేపచెట్లపై కూటమి నాయకుల కన్నుపడింది. దాదాపు రూ.రెండు లక్షల విలువైన 30 చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికి తరలించుకుపోయారు. సాధారణంగా చనిపోయిన చెట్లను తొలగించడం పరిపాటి. అయితే పచ్చని చెట్లను కూడా నరికి మాయం చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంటూ కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా పార్టీ



శ్మశానంలో వేపచెట్లు నరికివేయడంతో మిగిలిన మోడులు

నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారు. ఏ ఉద్దేశంతో ఈ చెట్లను నరకాల్సి వచ్చిందని పంచాయతీ, రెవెన్యూ, ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి స్పందన కానరాకపోవడం ఈ దోపిడీకి ఆయా శాఖల అధికారులు మద్దతు కూడా ఉందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

నల్లజర్ల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నల్లజర్ల సీఐ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్, అవేర్నస్ కార్యక్రమం జరిగింది. దీనికి ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నారు. నకిలీ లింకులు పంపుతూ ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ, ప్రజల ఖాతాల్లో సొమ్ము దోచేస్తున్నారన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ శాఖ ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, బాధితులు పెరుగుతూనే ఉన్నారన్నారు. ఇటువంటి



నల్లజర్ల జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

మోసాలు జరిగినప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. గోదావరి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు కె.వెంకట్రావు, డీవీఎస్ఎస్ రాజు, కె.శ్రీలక్ష్మి, స్కూల్ హెచ్ఎం కోమలిచిత్ర పాల్గొన్నారు. పాదుపు ఆవశ్యకత, వివిధ బ్యాంకు డిపాజిట్ పథకాలు, మొబైల్ బ్యాంకింగ్, ఫిర్యాదుల పరిష్కార వేదికలపై రిసోర్సు పర్సన్లు వై.బాబూరావు, ఎస్.అనిల్, బి.సుమంత్, బి.చైతన్య, ప్రదీప్ వివరించారు.

ఆరోగ్యకర సమాజానికి చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సమాజంలో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. మన పిల్లలకు ఎటువంటి లోపాలు ఉండకూడదని కోరుకుంటూ, దానిలో భాగంగా హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలోనూ జిల్లా ప్రారంభ జోక్యం కేంద్రాలు (డీఈఐసీ సెంటర్లు) ఏర్పాటు చేసి, వాటి ద్వారా సర్వే చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, డీఎం అండ్‌హెచ్‌ఓ, జిల్లా లీగల్ అథారిటీ సెక్రటరీ, మండల సెక్రటరీలతో ఒక టీమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాకు ఈ టీములను పర్యవేక్షణ కోసం పంపి, వారి ద్వారా అక్కడ దివ్యాంగులు పిల్లలు గుర్తిస్తామన్నారు. ఫిబ్రవరి 10న మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందన్నారు. డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సొసైటీ కింద ఉన్న తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాలకు సంబంధించిన ప్రాంతాలలో నమోదైన కేసులు రిఫరెన్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు వైద్య సేవలు అందించే విభాగాన్ని సందర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (ఇన్‌చార్జి) ఎస్‌కే జానీబాషా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి, డీఈఐసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.హరిచంద్ర ప్రసాద్, పిల్లల వైద్యురాలు డాక్టర్ ఇంద్రజ, డీఈఐసీ గవర్నమెంటు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో చిన్నారిని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కరాటే విజేతలకు అభినందనలు

ప్రకాశం నగర్: కాకినాడలో ఇటీవల నేషనల్ కరాటే పోటీలు జరిగాయి. కటాస్ స్పారింగ్ అండర్ 12, 19 విభాగాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. వారిని ఎస్పీ నరసింహ కిశోర్ తన కార్యాలయంలో అభినందించారు. సీహెచ్ నిషిత్, ఎం.ప్రసన్న వెంకట నాగ సూర్యశ్రీ బంగారు, ఆర్.మనోజ్ఞ, డి.చిన్మయ, వి.ఇందు, సీహెచ్ సునంద వెండి, కె.చరణీకృతి, జి.స్టీఫెన్ రాహుల్, కె.రుత్విక్, వి.అఖిల్ తేజ్‌లు కాంస్య పతకాలు సాధించారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి

దేవరపల్లి: పల్లంట్లలో బొల్లం మహాలక్ష్మి (78) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మహాలక్ష్మి గత కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రతి నెలా కుమార్తెలు, కుమారుల వద్దకు వెళ్లి వస్తూ ఉంటుంది. సోమవారం రాత్రి గ్రామంలోని చిన్న కుమారుడి ఇంటి వద్ద ఉంది. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు మహాలక్ష్మిని నిద్రలేపగా లేవకపోవడంతో పెద్ద కుమారుడికి సమాచారం ఇచ్చారు. పెద్ద కుమారుడు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని గోపాలపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పెద్ద కుమారుడు బొల్లం వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఉండ్రాజవరం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలియో అన్నారు. ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠం ఆవరణలో అనాలియో ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా పండించిన ఆకుకూరలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు స్వయంగా ఆకుకూరలు పండించేందుకు 10 సెంట్ల స్థలం కేటాయించడంతో అనాలియోకు కృతజ్ఞతలు తెలిపారు. పీఠం సభ్యుడు బూరుగుపల్లి కళారావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మి, సరస్వతి, అంగనాడీ టీచర్లు జానకీ, కనకదుర్గ, కమల కుమారి, ఉష, స్వర్ణలత, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

పెరవలి: జాతీయ రహదారి పక్కన నల్లాకుల వారిపాలెంలో భక్తాంజనేయస్వామి 52వ ఏకాహ మహోత్సవాలకు నాలుగో రోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. తెల్లవారు జామునే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గంధ సింధూరం, తమలపాకుల పూజ చేశారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 112 మంది తులాభారం వేయగా, 1,850 కిలోల పటిక బెల్లం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ పటిక బెల్లం తులాభారం సమర్పించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

నల్లజర్ల: అనంతపల్లిలో ఇటీవల అనారోగ్యానికి గురైన కంచర్ల వెంకన్న కుటుంబ సభ్యులను గోపాలపురం నియోజకవర్గ జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు మంగళవారం పరామర్శించారు. రూ.15 వేలను మందుల ఖర్చులకు అందజేశారు. నాయకులు సూర్నీడి కిశోర్, ఆలపాటి అఖిల్, తలారి సౌజన్య, రౌతు సాయి, ఉన్నమట్ల సత్య, పూరెళ్ల సత్యనారాయణ, గుండాబత్తుల వరుణ్ తదితరులు ఉన్నారు.

ఉద్భవ్ 2025 వెబ్‌సైట్ ఆవిష్కరణ

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ – 2025 వెబ్‌సైట్‌ను అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఈ నెల 20, 21, 22 తేదీలలో ఉద్భవ్ – 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులను ఒకచోట చేర్చి వారి ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణలను సాంస్కృతిక, విద్య, సహ పాఠ్య కార్యక్రమాల ద్వారా వెలుగులోకి తీసుకురానున్నామన్నారు. ఈ సందర్భంగా నాలుగు ఆన్‌లైన్, ఆరు ఆఫ్‌లైన్ పోటీలు జరుగుతాయన్నారు. కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉద్భవ్ -2025 వెబ్‌సైట్ అయిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏసీ.ఇన్‌ను సందర్శించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓట్లు వేయాలని కోరుతూ కొవ్వూరు ఎమ్మెల్యే మంగళవారం ప్రచారం నిర్వహించారు. దొమ్మేరు సచివాలయం, బ్యాంకు ఆఫ్ ఇండియా, వివిధ ప్రభుత్వ పాఠశాలలు తదితర చోట్ల పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జ్‌లకు సదస్సు నిర్వహించారు.

ఆ చట్టం జోలికి వస్తే సహించం

ప్రకాశం నగర్: గిరిజనుల జీవనాధారమైన 1/70 చట్టం జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గిరిజన, ఆదివాసీ, రైతు కూలీ, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆ చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో జరుగుతున్న రాష్ట్రవ్యాప్త 'ఏజెన్సీ బంద్' సంఘీభావంగా బుధవారం రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.